
ఈ వారం తెలుగు పుస్తకం

# తెలంగాణ సామాజిక జీవితాన్ని చిత్రించే కథలు

■ గుడిపాటి




**Author:** Kaluva Mallaiah
**Subject:** SHORT STORIES
**Year of Publication:** 2005
**Price:** USD $ 6.94

**చరిత్ర ఎప్పుడూ తనని తాను పునర్నిర్మించుకుంటుంది. తన తప్పిదాల్ని తానే సవరించుకుంటుంది. అన్య మార్గాల్నించి సామాన్యుల మార్గంలోకి ప్రయాణిస్తుంది. సాహిత్య, కళారంగాలకు సైతం ఇదే సూత్రం వర్తిస్తుంది. అణచివేత ఎల్లకాలం కొనసాగదు. వివక్షని ఎల్లకాలం సహించరు. తలవంచుకుని మౌనంగా ఉండిపోరు. తల పైకెత్తి సగర్వంగా చూస్తారు. నిండైన ఆత్మవిశ్వాసంతో నోరు విప్పి తమ గురించి తాము చెబుతారు. తమ అక్రోశాల్నీ, ఆవేదనల్నీ వ్యక్తం చేస్తారు. ఇది అనివార్యమైన సాధారణ చర్య. తెలంగాణ సృజనశీలుర సాహితీ వ్యాసంగాన్ని ఇందులో భాగంగానే చూడాలి.**

**ఇరవయ్యో శతాబ్దపు ఆఖరి దశకంలో తెలుగు సాహిత్యం కొత్త చైతన్యాన్ని సంతరించుకుంది. ఈ క్రమాన తెలంగాణ సాహిత్యం మరింత నిర్దిష్టతతో పదునెక్కింది. తన గాయాల్ని తాను తరచి చూసుకుని క్రోధంతో బుసకొట్టింది. దశబ్దాల వివక్షని ప్రశ్నించింది.**

తనదైన భాషలో తనని తాను వ్యక్తం చేసుకునే దిశగా విస్తరించింది. వివక్షని ప్రశ్నించడం వరకే పరిమితం కాలేదు. తన చరిత్రనీ, తన అస్తిత్వాన్నీ, తన ఉనికిని బలంగా చాటుకుంది. గతంలోకి చూపును ప్రసరించి పునర్విశ్లేషణలు ఆరంభించింది. తెలుగు సాహిత్య చరిత్రలో తన ప్రస్తావన నామమాత్రం కావడమేమిటని నిలదీసింది. తన కృషిని గుర్తించని కనిపించని రాజకీయాల మేలిముసుగుల్ని చించి పారేసింది. తానేమిటో తనదైన స్వరంతో చెప్పడం ఆరంభించింది. సాహిత్యంలో తన స్థానాన్నీ, తన శక్తినీ, బలాన్నీ ప్రకటిస్తూ వచ్చింది. ఈ క్రమానే తొలి తరం తెలంగాణ కథలు వచ్చాయి. కవిత్వ సంకలనాలూ వచ్చాయి. తెలంగాణకు అన్యాయం జరిగిందన్న వాస్తవాన్ని ఇతరులు గుర్తించడం తప్పనిసరయింది. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడం వరకే పరిమితం కాలేదు. దానిని సరిదిద్దడానికి తమంతట తాము ప్రయత్నించారు. ఇతరులు కూడా తమ మాటనీ, చేతనీ మార్చుకుని తెలంగాణ సృజనశీలతని గుర్తించేట్టు చేశారు. నిజాయితీ గలవారు తెలియక చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నారు. చారిత్రక తప్పిదాల్ని తమకు సాధ్యమైన రీతిలో సరిదిద్దుకుంటున్నారు. *విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్* వారు *'తెలంగాణ కథలు'* అనే బృహత్తర కథల సంకలనం ప్రచురించడం ఇందుకు ఒక దాఖలా.ఈ సంకలనానికి సంపాదకులుగా కాలువ మల్లయ్య, సదానంద్ శారద, చంద్ర వ్యవహరించారు. తొమ్మిది దశాబ్దాల తెలంగాణ సాంస్కృతిక సామాజిక పోరాట రూపురేఖల్ని చిత్రించే కథలు ఈ పుస్తకంలో వున్నాయి.

"ఒకప్పుడు తెలుగు కథకు పెద్ద దిక్కు తూర్పుగా భావించారు. మధ్యలో రాయలసీమకు మళ్లింది. ఈనాడు రాశిలోను, వాసిలోను సాహితీపరులందరూ తెలంగాణ దిక్కు చూడాల్సిందే" అని ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదకుడు ఏటుకూరి ప్రసాద్ అన్నారు. ఈ మాటలు చాలు సాహిత్యరంగాన తెలంగాణ ప్రాశస్త్యం ఏమిటో చెప్పడానికి. దీనిని గుర్తించారు కాబట్టే తొంబై మంది కథకుల కథలలో దాదాపు ఎనిమిది వందల పేజీలకు పై బడిన ఈ పుస్తకాన్ని 'విశాలాంధ్ర' వారు ప్రచురించారు. 1912 నుంచి 2004 వరకు రాసిన కథల్లో తొంభయింటిని పుస్తక సంపాదకులు ఎంపిక చేశారు. దాదాపు తొమ్మిది దశాబ్దాల సామాజిక జీవిత చరిత్రకు ప్రాతినిధ్యం వహించే కథలు ఇందులో ఉన్నాయి. చరిత్ర పొడుగునా తెలంగాణ ఎదుర్కొన్న అగచాట్లు, తెలంగాణ వాసుల ఇక్కట్లు ఈ పుస్తకంలో చూడొచ్చు.

ఈ పుస్తకంలో నాలుగు దశల్లో వచ్చిన కథలు కనిపిస్తాయి.

1. తెలంగాణలో కథ పుట్టిన 1912 నుంచి 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినంతవరకు వచ్చిన కథలు.

2. 1956 నుంచి 1970 వరకు వచ్చిన కథలు

3.1970 నుంచి 1995 వరకు వచ్చిన కథలు

4.1995 నుంచి ఈనాటి వరకు వస్తున్న కథలు

ఈ నాలుగు దశల్లో వచ్చిన తెలంగాణ కథల్లో విభిన్న పార్శ్వాలున్నాయి.

ఈ విభజనకి ప్రాతిపదిక ఏమిటనే ప్రశ్న రావడం సహజం.

మొదటి దశలోనూ నిజానికి రెండు దశలున్నాయి. అది1912 నుంచి 48 వరకు ఉన్న దశ. 48 లో పోలీస్ యాక్షన్ జరగడం వరకు నిజాం ప్రభువుల ఏలుబడిలో తెలంగాణ ఉంది. తర్వాతి కాలంలో 1956 వరకు ఇక్కడ హైదరాబాద్ రాష్ట్రంలో తెలంగాణ తనదైన ప్రత్యేక ఉనికితో ఉంది. అయితే ఈ ఎనిమిదేళ్ళ కాలంలో పెద్దగా చెప్పకోదగిన పరిణామాలేవీ లేవు. కనుక రెండింటిని కలిపి ఒక దశగా పేర్కొనవచ్చు. అందుకని ఇది తొలితరం తెలంగాణ కథల దశ. 1956 లో ఆంధ్రప్రదేశ్ లో కలిసిపోయాక తెలంగాణ తన అస్తిత్వం కోల్పోయింది. దరిమిలా తెలంగాణ సాహిత్యం వివక్షకి లోనయింది.

రెండో దశలో తెలంగాణ ప్రాంతం, సాహిత్యం ఉనికి నామమాత్రమైంది. వివక్షపూరిత వైఖరి ఈ ప్రాంతం మీద రాజ్యమేలింది. కానీ దీని ఛాయలు తెలంగాణ సాహిత్యంలో పెద్దగా కనిపించవు. ఒకరకంగా తెలంగాణ సాహిత్యంలో పెద్దగా కదలిక లేని దశ ఇది. ఆందోళన. ఆవేదనలు ఉన్నా వాటి ప్రతిఫలనాలు చెప్పకోదగిన రీతిన సాహిత్యంలో కనిపించవు. నిజానికి నాడు తెలుగు సాహిత్య రంగపు స్థితి కూడా అదే అని చెప్పాలి.

మూడవ దశలో విప్లవ చైతన్యం, విభిన్న ఉద్యమాల చైతన్యం నేపథ్యంలో తెలంగాణ కథ, కవిత్వం వర్ధిల్లాయి. పోరాటం ఊపిరిగా సాహిత్యం వెల్లువగా వచ్చింది. 1969లో ప్రత్యేక తెలంగాణ నినాదం ఒక కదలికని తెచ్చింది. తర్వాత కాలంలో విప్లవోద్యమం తెలంగాణ వాసుల ఆందోళనకి ఒక దిశని ఇచ్చింది. అయితే దోపిడినుంచి విముక్తి ప్రాధాన్యంలోకి రాగా ప్రత్యేక తెలంగాణ నినాదం వెనకపట్టు పట్టింది. అన్నిరకాల దోపిడీ పీడనలకి వ్యతిరేకంగా ఉద్యమ చైతన్యం వెల్లువెత్తింది. ఈ క్రమంలో సామాజిక జీవితంలో వచ్చిన మార్పుల క్రమం సాహిత్యంలో వ్యక్తమైంది. తొంభైల ఆరంభం నాటికి దళిత, మైనారిటీవాదాలు, గ్లోబలైజేషన్ వ్యతిరేక చైతన్యం పదునెక్కింది.

నాలుగో దశలో విప్లవోద్యమం ద్వారానే విముక్తి సాధ్యమన్న కలలు సాకారం దాల్చలేదు. అమెరికా పెత్తనమే కాదు ఆంధ్రుల పెత్తనం సైతం తమని కుంచింపజేస్తుందన్న స్పృహ తెలంగాణవాసుల్లో బలపడింది. కాలక్రమాన ప్రాంతీయ స్పృహ చైతన్యంగా పరిణమించి ఉద్యమరూపు దాల్చింది. తన చరిత్రని తాను తెలుసుకుని తెలంగాణ నినాదం బలపడింది. ఈ దశ మొత్తం తెలంగాణ సాహిత్యాన్ని మలుపు తిప్పింది. 1994-95 సంవత్సరాల ఆరంభం నుంచి 2000 సంవత్సరం వచ్చేనాటికి తెలంగాణ చైతన్యం బలమైన ఉద్యమంగా రూపుదాల్చింది. సాహిత్యం వెల్లువెత్తడానికి కారణమైంది. కనుక ఈ దశ స్థిరపడింది. తెలుగు కథలో తెలంగాణ కథ ప్రత్యేక పాయగా రూపు దిద్దుకుంది. దీనిని ప్రతిఫలించే కథలు ఇందులో ఉన్నాయి.

ఈ నాలుగు దశలలో తెలంగాన కథ పరిణామాశీలతని ఈ పుస్తకం ప్రతిబింబిస్తుంది.

• • • • • • •

తొమ్మిది దశాబ్దాల తెలంగాణ కథల వస్తుశిల్పాల్లో విభిన్న రీతులున్నాయి. చరిత్రగతిలో మలుపు తిరిగిన మహత్తర సంఘటనల ప్రతిఫలనం ఉంది. కాలక్రమాన అనేక మలుపుల్లో జీవితంలో సంభవించిన మార్పుల క్రమం కూడా ఈ కథల్లో రికార్డయింది.

తెలంగాణలో కథ పుట్టుకకి ఉన్న నేపథ్యం, కోస్తాంధ్రలో తెలుగు కథ ఆవిర్భావ నేపథ్యం భిన్నమైనవి. రెండు ప్రాంతాల్లో కథ పుట్టుక కొద్ది తేడాతో దాదాపుగా ఒకే సమయంలో జరిగినా, దాని ప్రయాణం, వికాసం మాత్రం భిన్నదారుల్లో సాగింది. వచన ప్రక్రియలు వికసించి, విస్తరించడానికి అవసరమైన సాహితీ నేపథ్యం తెలంగాణలో తక్కువ. ఆంధ్ర ప్రాంతాన 1920-30ల నాటికే గురజాడ, చలం, శ్రీపాదవంటి ఉద్దండులు కథకులుగా వాసికెక్కారు. తెలంగాణలో 1912లో మాడపాటి హనుమంతరావు కథ పుట్టుకకి పాదు వేసినా 1930 వరకు ఒక మహా నిశ్శబ్దం రాజ్యమేలింది. ఈ పుస్తకంలో మొదటి కథ 1912 సంవత్సరంలోది కాగా, రెండో కథ 1930ల నాటిది. మూడు, నాలుగు కథలు 1930, 32 ల నాటివి. అయిదో కథ 1941 ల నాటిది. అంటే ఒకసారి పద్దెనిమిదేళ్ళు, మరోసారి తొమ్మిదేళ్ళ విరామం. ఈ విరామ కాలంలో కథలు రాలేదని కాదు, వచ్చాయి. కానీ శక్తివంతమైన ప్రభావం చూపలేకపోయాయి. కానీ 1912 నుంచి 1941 వరకు ఆంధ్రప్రాంతాన తెలుగు కథ వికసించి, విస్తరించింది. బలపడింది. అప్పటి కథల్ని ఇప్పటికీ ఈ తరం పాఠకులు చదువుతున్నారు. ఈ వాస్తవాన్ని కూడా ఒప్పుకోవాలి. అయితే అందుకు కావాల్సిన నేపథ్యం అక్కడ ఉంది.

తెలంగాణకి వస్తే తెలుగులో చదువుకునే అవకాశమే తక్కువ. శతాబ్దాలుగా ఉర్దూభాషలో ఇక్కడివాళ్ళుచదువుకున్నారు. అక్షరాస్యత మరీ తక్కువ. భూస్వామ్య శక్తుల ఆధిపత్యంలో ప్రజలు అణగారిపోయారు. అక్షరాలకు దూరంగా ఉండిపోయారు. అంతేకాక ఆంధ్రలో మాదిరిగా ఆధునిక చదువులకీ, ఆంగ్లభాషలో అధ్యయనానికీ ఇక్కడ అవకాశాలు లేవు. ఇలా గమనిస్తే బ్రిటిషాంధ్రకీ, నిజాం ఏలుబడిలోని తెలంగాణకి మధ్యన అంతరాలు ఎన్నో కనిపిస్తాయి. రెండు ప్రాంతాలు కేవలం భాష రీత్యా ఒకే తీరుగా కనిపించినా. సామాజిక జీవితం, సంస్కృతి భిన్నమైనవి. అందువల్ల తెలంగాణ కథని ప్రత్యేకంగా చూస్తేనే దాని పుట్టుకనీ, వికాసాన్నీ సరిగ్గా అంచనా వేయగలం, అర్థం చేసుకోగలం.

• • • • • • • •

ఈ పుస్తకంలో 1912 నుంచి 1956 వరకు వచ్చిన కథల్లో పందొమ్మిది కథల్ని ఎంపిక చేశారు. ఇవి తొలితరం తెలంగాణ కథలు. రచయితలు ఉన్నత, మధ్యతరగతికి చెందినవారు. ఉర్దూభాషలో చదువుకున్నవారు. మాడపాటి హనుమంతరావు కథలో సరళ గ్రాంథికం ఉంది. జమీందారుల దోపిడీ మనస్తత్వం, నీతి నిజాయితీలతో బతకాలనుకున్న వ్యక్తికి వాటిల్లే మానసిక సంఘర్షణ నేపథ్యంతో ఈ కథ నడిచింది. తెలంగాణలో జమీందారులు, దొరలు సాగించిన పెత్తనం, దౌర్జన్యం ఏ తీరున ఉందో ఈ కథ చెబుతుంది.

సురవరం ప్రతాపరెడ్డి, నందగిరి వెంకట్రావు, భాగ్యరెడ్డి వర్మ కథలు కూడా ఇదేవిధంగా సరళ గ్రాంథికంలో ఉన్నాయి. ప్రతాపరెడ్డి కథల్లో తర్వాత భాష తీరు మారింది. ఈ పుస్తకంలోని కథలో సరళ గ్రాంథికం ఉండటంతోపాటు ఉర్దూ భాషా ప్రభావం ఉంది. తెలంగాణ ప్రాంతంలో నాడు వాడుకలో ఉన్న సామెతలు, స్థానిక పలుకుబళ్ళు ఉన్నాయి. దైనందిన జీవితంలో ఉర్దూ పదాలు ఏ విధంగా మిళితమై ఉన్నాయో ప్రతాపరెడ్డి కథ చదివితే తెలుస్తుంది.

పెండ్యాల శేషగిరిరావు, కాళోజీ నారాయణరావు, కాంచనపల్లి చిన వెంకటరామారావు, జి.రాములు, నెల్లూరు కేశవస్వామి మొదలయినవారు 1948 నాటికే కథలు రాస్తున్నారు. 1948 తర్వాత 1956 వరకు కథలు రాసిన ప్రముఖులలో పి.వి.నరసింహారావు (మాజీ ప్రధానమంత్రి), వట్టికోట ఆళ్వారు స్వామి, కందుకూరి లింగరాజు, పొట్లపల్లి రామారావు, సురమౌళి మొదలయిన ప్రముఖ రచయితలున్నారు.

1912 నుంచి 1956 వరకు తెలంగాణ జీవితం ఏ తీరున ఉందో చిత్రించడానికి ఈ రచయితలు ప్రయత్నించారు. ముఖ్యంగా తెలంగాణాలోని మధ్యతరగతి జీవితం ఏ విధంగా ఉందో ఈ కథలు చెబుతాయి. అదే సమయాన మధ్యతరగతి రచయితల కథావస్తువుల్లోని వైవిధ్యం కనిపిస్తుంది. తెలంగాణ గ్రామీణ జీవితం, అక్కడి మనుషులు, ఆవేదనలు, సంబంధాల క్రమంలోని వైరుధ్యాలు వ్యక్తమయ్యాయి. సామాజిక జీవితంలోని అంతరాలు ప్రతిఫలించాయి. తెలంగాణలో దొరల పెత్తనం, నిజాం ప్రభువుల భూస్వామిక పాలన తెచ్చిపెట్టిన అగచాట్లు ప్రజల్ని ఎన్ని ఇక్కట్లకు గురిచేశాయో ఈ కథలు చిత్రించాయి. మానవ సంబంధాలలోని ఉద్వేగాల చిత్రీకరణ బలంగా ఉంది. ' నా స్నేహం' శీర్షికన కాళోజీ రాసిన కథ ఆనాటి మనుషుల్లోని మానవీయ కోణాల్ని వ్యక్తం చేసింది. 'విశ్వప్రేమ', 'అన్నా-చెల్లెలు' కథలు మానవ సంబంధాల్లోని సున్నితమైన పార్శ్వాల్ని చిత్రించాయి. ఈ కథలు సరళ గ్రాంథికంలో ఉండటం గమనార్హం. తెలంగాణలో తిరుగుబాటు చైతన్యం పొడుకోవడాన్ని, రగుల్కొవడాన్ని తొలితరం కథకులు చిత్రించారు. కాంచనపల్లి చినవెంకట్రామారావు రాసిన 'చెరువొడ్డున' కథ ఈ కోవకి చెందింది. జీవిత పోరాటంలో మహిళల తెగువని చిత్రిస్తూ పి.వి.నరసింహారావు 'గొల్ల రామవ్వ' కథ రాశారు. సిసలైన తెలంగాణ జీవద్భాష ఈ కథలో కనిపిస్తుంది. కథా కథనం తెలంగాణ భాషలో సాగింది. పాత్రల సంభాషణ , కథకుని కథనం ఒకే భాషలో ఒకే తీరున సాగాయి. నెల్లూరి కేశవస్వామి కథ హిందూ ముస్లింల సంబంధాల్ని సరిగ్గా చిత్రించింది. నిజాం కాలంలో రాజాకార్లు అనే దుష్టసైన్యం పుట్టుకు రావడం, జనాల మధ్యన ఘర్షణలు సృష్టించే నేపథ్యంలో ఏర్పడిన అపోహలు, అపార్థాల తీరుతెన్నులు, వాటిని అధిగమించి లౌకికతత్వంలో జనాలు జీవించిన వైనాన్ని ప్రతిభావంతంగా చిత్రించారు కేశవస్వామి. ఆయన రాసిన 'చార్మినార్ కథల్లో' ఈ ధోరణి స్పష్టంగా ఉంది. ఇలా రచయితలు ఆనాటి సామాజిక జీవితంలోని అనేక పార్శ్వాల చిత్రీకరణకి ప్రాధాన్యమిచ్చారు. 1956 వరకు కథలు రాసిన మహిళలు తక్కువ. మహిళలు

చదువుకోవడమే తక్కువ కాబట్టి వారిలో రచనా వ్యాసంగం పట్ల ఆసక్తితో ముందుకు వచ్చినవారు అరుదు. బహుశా ఈ కారణం వారిలో రచనా వ్యాసంగం పట్ల ఆసక్తితో ముందుకు వచ్చినవారు అరుదు. బహుశా ఈ కారణం వల్లనే కావచ్చు ఈ కథల సంపుటిలో 1956 వరకు ఉన్న కథల్లో నందగిరి ఇందిరాదేవి రాసిన కథ ఒక్కటే చోటు చేసుకుంది.

ఈ తొలి తరం కథల్లో వస్తు వైవిధ్యం బాగానే వున్నట్లు కనిపించినా శిల్ప వైవిధ్యం పెద్దగా కనిపించదు. కథని సాదాసీదాగా చెప్పకుంటూ పోవడమే కనిపిస్తుంది. ఎలాంటి ప్రయోగాలు, విన్యాసాలు కనిపించవు. గ్రాంథికంలో చదువుకున్నవారు ఆ పరిధి నుంచి బయట పడలేక అదే భాషలో కథలు రాశారు. కానీ ఇక్కడి భాషలో మమేకమైనవారు తాము ఎంచుకున్న ఇతివృత్తానికి తగినట్టుగా అందుకు అనువైన భాషలో కథ చెప్పకొచ్చారు. కనుక నాడు తెలంగాణ పట్టణాల్లో, పల్లెల్లో మాట్లాడే భాషని యథాతథంగా రాశారు. వారు సంభాషణల్లోనూ, కథనంలోనూ తెలంగాణ భాషనే వాడారు. తాము వాడుతున్నది తెలుగు భాషే అనుకున్నారుగానీ తెలంగాణ మాండలికంలో రాస్తున్నామన్న స్పృహ ప్రత్యేకంగా ఏమీ లేదు. ఎందుకంటే భాషకి సంబంధించిన అంతరాలు లేవు. ఇతరుల పెత్తనాల్లేవు. తమ భాషలో తాము రాయడానికి కించపడాల్సిన పరిస్థితులు లేవు. జన జీవితంలో కలిసిపోయిన ఉర్దూ పదాలు, వాక్యాలు ఈ కథల్లో కనిపిస్తాయి. ఎందుకంటే తెలంగాణ భాషలో ఉర్దూ పదాలు ఎప్పట్నించో కలగలసిపోయి వున్నాయి. వాటిని వాడుకోకూడదన్న నిబంధన లేవీ ఇక్కడి రచయితలు విధించుకోలేదు. అందువల్లనే ఉర్దూ పదాలతో సమ్మిశ్రితమైన తెలంగాణ భాష సొగసులు, సొబగులు తొలితరం తెలంగాణ కతల్లో గుబాళిస్తాయి. సురమౌళి, పొట్లపల్లి రామారావు, ఆళ్వారుస్వామి, కాంచనపల్లి, పి.వి.నరసింహారావు మొదలయిన వారి కథల్లో నాటి అచ్చమైన తెలంగాణ భాష జీవంతో తొణికిసలాడుతుంది. తెలంగాణ భాషలోని పలుకుబళ్ళు, నానుళ్ళు, సామెతలు.. వాటిని ఉపయోగించిన తీరు ఆకట్టుకుంటుంది. ఈ భాష నాటి తెలంగాణ కథకి శోభని ఇచ్చింది. శైలీశిల్పాల కన్నా భాషలోని వైశిష్ట్యం కారణంగా నాటి తెలుగు కథలో ఈ తెలంగాణ కథ ప్రత్యేకంగా అలరారుతుంది.

1956 తర్వాత వచ్చిన కథల్ని గమనిస్తే భాషలో వచ్చిన మార్పులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. 1956 నుంచి 1969 వరకు వచ్చిన కథలు రెండో తరం కథలు. ఈ దశలో వచ్చిన కథల్లోంచి పదమూడు కథలకి ఈ పుస్తకంలో ప్రాతినిధ్యం కల్పించారు. 1956 లో 'ముక్కోటి బలగమోయి' శీర్షికన జి.సురమౌళి రాసిన కథలో నాడు ఆంధ్రుల్లో తెలంగాణ వాళ్ళ పట్ల ఉన్న భయసందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ తెలంగాణ వాళ్ళ మంచితనం ఏమిటో చిత్రించారు. ఈ కథలో తెలంగాణ భాష ఉంది . ఆ తర్వాత వచ్చిన కథల్లో ఎక్కువభాగం మధ్యతరగతికి సంబంధించిన ఇతివృత్తాలున్నాయి. గ్రామీణ జీవిత పార్శ్వాల చిత్రీకరణ తక్కువ. స్త్రీ పురుష సంబంధాలలోని విభిన్న కోణాల్ని రచయితలు చిత్రీకరించారు. ప్రేమ, అనుమానం, నమ్మకం, అపనమ్మకం వంటి అంశాలు కథా వస్తువులయ్యాయి.

1956 నుంచి 69 వరకు తెలంగాణ సామాజిక జీవితంలో అనేక మార్పులు వచ్చాయి. రాజకీయాల్లోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించిన ప్రభావం క్రమంగా తగ్గుముఖం పట్టింది. దొరల పెత్తనం ఓ మేరకు బాగానే తగ్గినా గ్రామాల్లో భూస్వాముల పలుకుబడి పూర్తిగా అంతరించలేదు. రాజకీయ నాయకత్వం రూపంలో వారు తమ పునాదుల్ని సుస్థిరం చేసుకున్నారు. అదే

క్రమంలో పోరాటం ఇచ్చిన స్ఫూర్తి కారణంగా చదువుకునే వారి సంఖ్య పెరిగింది. జీవన రంగాల్లో మార్పులు వచ్చాయి. పట్టణ, నగర జీవితం విస్తరించడం మొదలయింది. కానీ ఈ క్రమంలో మార్పుల క్రమాన్ని చిత్రిస్తూ వచ్చిన కథలు అరుదు. ముఖ్యంగా అప్పుడే ఆవిర్భవిస్తున్న మధ్యతరగతిలోని వైరుధ్యాల్నీ, సందిగ్ధాల్నీ రేఖామాత్రంగానే చిత్రించారు రచయితలు. విలువల్లో వచ్చిన మార్పుల్ని కూడా చూపిన వారు తక్కువ.

గూడూరి సీతారాం, చక్రవర్తి రంగస్వామి, డి.రామలింగం, ఊటుకూరు రంగారావు, భాస్కరభట్ల కృష్ణారావు, కొండపల్లి వెంకట శేషగిరిరావు, దాశరథి రంగాచార్య మొదలయినవారి కథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. వీరితో పాటు ఈ దశలో రచయిత్రులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఇల్లిందల సరస్వతీ దేవి, పి.యశోదారెడ్డి రాసిన కథలు ఇచ్చారు. వీరు ఇద్దరూ స్త్రీల జీవితాలకి సంబంధించిన అంశాల్ని ఇతివృత్తాలుగా తీసుకున్నారు. తెలంగాణ లో మొదటి సారి స్త్రీల గురించి స్త్రీలు రాయడమనేది వీరితోనే ఆరంభమయింది. వీరేకాక మగవాళ్ళు రాసిన కథల్లోనూ స్త్రీ పురుష సంబంధాల చిత్రణ ఉంది. కాగా, రెండో తరం రచయితలు మధ్యతరగతి జీవిత చిత్రణకి ప్రాధాన్యమిచ్చారు. కథనంలోనూ, భాషలోనూ మార్పులు వచ్చాయి. తెలంగాణ మాండలికం స్థానంలో వ్యవహారిక భాషగా చెప్పబడే కోస్తావారి భాషలో రాయడం ఈ రెండో దశలో మొదలయింది. తొలితరం తెలంగాణ కథకుల మాదిరిగా వీరి భాషలో మాండలిక పద సౌందర్యం గానీ, పల్లెల్లోని పలుకుబళ్ళు, సామెతలు గానీ పెద్దగా కనిపించవు. అయితే ఈ మాండలిక భాష సొగసులు యశోదారెడ్డి కథలో మాత్రం నిండుగా ఉన్నాయి. ఎక్కువ మంది కథలు తెలంగాణ భాషలో ఉండకపోవటంలో ఆశ్చర్యం లేదు. ఎందకంటే నాటికే తెలంగాణ భాష పట్ల వివక్ష పెరిగింది. ఇక్కడి వాళ్ళ భాషని చిన్నచూపు చూశారు. ఆంధ్రుల భాషనే అచ్చ తెనుగు భాషగా భావించే పరిస్థితి దాపురించింది. ఈ కారణంగా రెండో తరం వారి కథల భాషలో మార్పులు వచ్చాయి. ఇతివృత్తాల పరంగానూ ఈ తేడా ఉంది. తొలితరం రచయితల కథల్లో గ్రామీణ జీవిత నేపథ్యం అధికం. రెండో తరం కథల్లో అది తక్కువ. దాని స్థానంలో కొత్తగా పుట్టుకొస్తున్న తెలంగాణ మధ్యతరగతి వారి జీవిత విలువలు ఇతివృత్తాల్లో చోటు చేసుకున్నాయి. ఇదంతా కూడా తెలంగాణ ప్రాంతం ఆంధ్ర, రాయలసీమలతో కలసి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడడం వల్ల ఏర్పడిన స్థితి. అన్యప్రభావాల కారణంగా మారిన తెలంగాణ కథల తీరుతెన్నులకి ఈ కథలు దాఖలా. ఈ కాలంలో తెలంగాణలో పెద్దగా ఉద్యమాలేవీ లేవు. ఆలోచనలకి పురిగొల్పే అంశాలేవీ లేవు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోనూ ఉద్యమాలూ, సంచలనాలూ పెద్దగా కనిపించవు. ఈ కారణంగా రెండో తరం కథలు సాదాసీదాగా ఉన్నాయనే చెప్పుకోవాలి. తెలంగాణ కథ వికాసంలో ఇదొక దశ మాత్రమే.

• • • • •

1969 -70 నాటికి తెలంగాణలో కొత్త చైతన్యం పాదుకుంది. మూడో తరం తెలంగాణ కథలో వైవిధ్యాలున్నాయి. వైరుధ్యాలున్నాయి. కొత్త చైతన్యం సంతరించుకుంది. నాటి చారిత్రక పరిస్థితుల ఇందుకు అవసరమైన రంగాన్ని సిద్ధం చేశాయి. 1969-70 ల నాటికి ముల్కీ-నాన్ ముల్కీ అంశాలు ఎజెండా మీదకు రావడం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలు ఉద్ధృతంగా వెల్లువెత్తడం, మరో వైపున విప్లవోద్యమాలు పాదుకోవడం తెలంగాణలో ఉద్యమ చైతన్యాన్ని పెంపు చేశాయి. దీనికి ముందు దిగంబర కవులు మధ్యతరగతి మిథ్యా విలువల పై ధ్వజమెత్తడం సాహిత్యరంగంలో మొనాటనీని ఛేదించింది. వస్తువులోనూ, రూపంలోనూ, నవ్యత విలక్షణత కనిపించాయి.కదిపి కుదిపే లక్షణం సాహిత్యానికి ఉండాలన్న స్పృహ బలపడింది. ఈ పూర్వ రంగంలో

తెలంగాణ నుంచి వచ్చిన కథల్లో తెలంగాణ సామాజిక జీవితం కొత్తగా ఆవిష్కృతమైంది. ఈ కాలంలో వచ్చిన కథల్లోంచి దాదాపు పాతిక కథలకి పైగా ఈ సంకలనంలో ఉన్నాయి. దాశరథి రంగాచార్య, నిఖిలేశ్వర్, దేవరాజు మహారాజు, అల్లం రాజయ్య, నందిని సిధారెడ్డి, వుప్పల నరసింహం, సదానంద్ శారద, నవీన్, సాహు, బోయ జంగయ్య, తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, ఆడెపు లక్ష్మీపతి, జూకంటి జగన్నాథం, జింబో మొదలయినవారు రాసిన కథలు ఇందులో ఉన్నాయి. తెలంగాణ నేటివిటీ, భాష, జీవితం, సంస్కృతి వీరి కథల్లో వ్యక్తమయ్యాయి. నిరుద్యోగం, దారిద్ర్యం, పల్లెలో దొరల పెత్తనాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు, సంఘటితయిన రైతుకూలీల ఉద్యమాలు ఈ కథల్లో చిత్రితమయ్యాయి, గడీల్లో దొరల, దొరసానుల దుర్మార్గం ఎలా ఉంటుందో చావా శివకోటి కథ చెబుతుంది. ఇలాంటి దుర్మార్గాలకి వ్యతిరేకంగా సంఘాలు పెట్టి ప్రజల్ని కదిలించడంలో విప్లవోద్యమాలు సఫలీకృతమయ్యాయి. వీటి ప్రభావాన్ని చిత్రించిన కథలు కూడా ఈ దశలో వచ్చాయి. కార్మికుల వ్యథల్ని, బాధల్ని, వారి కష్టనష్టాల్ని చిత్రించే కతలకి పులుగు శ్రీనివాస్ రాసిన కథ 'బోనస్' ఉదాహరణ. తెలంగాణ సాయుధ పోరాటం తర్వాత భూస్వాముల పెత్తనాలు పూర్తిగా అంతరించలేదు. ఏదో రూపంలో వారి దోపిడీ దౌర్జన్యాలు సాగుతూనే ఉన్నాయి. అ వాస్తవాల్ని చిత్రించే కథలు ఈ కాలంలో వచ్చాయి. వీటికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమయిన తీరును వాస్తవికంగా చెప్పాయి. మైదాన ప్రాంతాల ప్రజలే కాదు అడవుల్లోని ఆదివాసీలు పడుతున్న ఇక్కట్లని సాహు, గోపి భాగ్యలక్ష్మి లాంటి కథకులు చెప్పకొచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి ముప్పయ్యేళ్ళు అవుతున్నా దళితుల మీద వివక్ష ఆగలేదు. అంటరానితనం రాజ్యమేలుతూనే ఉంది. భూస్వామ్య భావజాలం పాతుకుపోయి ఉన్న తెలంగాణలో ఇది మరీ ఎక్కువగానే ఉంది. ఇలాంటి పరిస్థితుల మధ్యన అణగారి పోయిన దళితుల జీవితాన్ని చిత్రించే కతలు బోయ జంగయ్య మరికొందరు రాశారు. ఇలా తెలంగాణ జీవితంలోని బహుముఖ పార్శ్వాలు పాతికేళ్ళ కాలంలో వచ్చిన కథల్లో వ్యక్తమయ్యాయి. వాటికి ప్రాతినిధ్యం వహించే కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. మధ్యతరగతి జీవితం కన్నా గ్రామీణ జీవితం మూడో దశల కతల్లో ఎక్కువ భాగం ఆక్రమించింది. తెలంగాణ మధ్యతరగతి జీవితాన్ని చిత్రించే కథలు అరుదుగా వచ్చాయి.

ఈ కాలంలోనే కథకులు మాండలికంలో రాశారు. ఈ కారణంగా మాండలికంపై చర్చ జరిగింది. సంభాషణలు మాండలికంలో ఉండి, కథనం మాత్రం వ్యవహారికంలో ఉండాలన్న ధోరణిలో చాలామంది మాట్లాడారు. కానీ దేవరాజు మహారాజు, వుప్పల నరసింహం, బోయ జంగయ్య, సదానంద్ శారద, అల్లం రాజయ్య , తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, ఆడెపు అక్ష్మీపతి, సాహు, గోపి భాగ్యలక్ష్మి లాంటి వారు తెలంగాణ భాషలోనే కథలు రాశారు. కథనరీతి మాత్రం వాస్తవిక శిల్ప పరిధిలోనే ఉంది. ఈ దశలో రచయిత్రుల నుంచి మాదిరెడ్డి సులోచన , పోల్కంపల్లి శాంతాదేవి, గోపి భాగ్యలక్ష్మి రాసిన కథలకి ప్రాతినిధ్యం లభించింది. కానీ తెలంగాణ మహిళల జీవితాల చిత్రణ ఎక్కువగా కనిపించదు. సకల పీడనల్నించి విముక్తికి విప్లవోద్యమమే బాసటగా తోడ్పడుతుందన్న భావజాలం 1990ల ఆరంభం వరకు బలంగా ఉంది. అప్పటికే స్త్రీవాదం పాదుకున్నా ఈ ప్రాంతానికి దాని చైతన్యం విస్తరించలేదు. అందువల్ల 1995 వరకు వచ్చిన కథల్లో స్త్రీవాద ప్రభావం కనిపించదు. దళితవాదం అప్పడే బలపడుతోంది. మూడో దశలో ఈ దృక్పథం నుంచి తెలంగాణలో కథలు రాసిన వారు కనిపించరు. విప్లవోద్యమం బలంగా ఉన్నంత కాలం దాని ప్రభావం తెలంగాణ పల్లె జీవితం మీద ఎలా ఉండేదో చెప్పే కథలే వచ్చాయి. ఈ కాలాన తెలంగాణ నుంచి విప్లవ కథ బలపడి పాఠకుల మీద ప్రభావం చూపింది. ఆ తరహా కథలు ఈ సంకలనంలో ఉన్నాయి.

•••••••

1995-96 నుంచి ఇప్పటి వరకు వచ్చిన కథల్ని నాలుగో దశ కిందకి చేర్చాలి. ఎవరి అనుభవాల్ని వాళ్ళే బలంగా రాయగలరన్న వాదం బలపడి అస్తిత్వవాదాలు పుంజుకున్న కాలమిది. స్త్రీ, దళిత, మైనారిటీ వాదాలు క్రమంగా బలపడ్డాయి. మరో వైపున ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో జీవితం బీటలు వారింది. తెలంగాణలో విప్లవోద్యమాలు బలహీన పడ్డాయి. దళిత చైతన్యం పెల్లుబికింది. తర్వాత కాలంలో మాదిగ దండోరా ఉద్యమం వచ్చింది. నిర్దిష్టత మరింత పదునెక్కింది. అమెరికా పెత్తనమే కాదు ఆంధ్ర వలసవాదుల పెత్తనాన్ని వ్యతిరేకించాలన్న స్పృహ పెరిగింది. ఈ క్రమంలో వచ్చిన కథలు ఈ ధోరణుల్ని చిత్రించాయి. ప్రాంతీయ స్పృహది పై చెయ్యి అయ్యింది. ఎవరి అనుభవాల్ని వాళ్ళు రాయడమే కాదు, ఎవరి భాషలో వాళ్ళు రాసుకునే హక్కు వుందని, తమ భాషలో తాము రాస్తామని తెలంగాణ సృజనశీలురు సగర్వంగా ప్రకటించారు. అందుకు అనుగుణంగా తెలంగాణ కథల రీతి మారింది. వస్తు విస్తృతి సంతరించుకుంది, ఈ దశలో భూపాల్, కాలువ మల్లయ్య, అంబల్ల జనార్దన్, ఎన్.కె.రామారావు. బి.ఎస్. రాములు, ముదిగంటి సుజాతారెడ్డి, పి.చంద్, జాతశ్రీ, అఫ్సర్, కె.వి. నరేందర్, బోధనం నర్సిరెడ్డి, గూడ అంజయ్య, ముక్తవరం పార్థసారథి, కాసుల ప్రతాపరెడ్డి, పులిపాటి గురుస్వామి, బెజ్జారపు రవీందర్ మొదలయినవారి కథలు విభిన్న వస్తురూపాల్లో వచ్చాయి. ఈ నాలుగో దశలోనే దాదాపు ముప్పయిమందికి పైగా రాసిన కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. ముఖ్యంగా 2000 సంవత్సరం నుంచి వచ్చిన దాదాపు ఇరవైకి పైగా కథలు సంకలనంలో ఉన్నాయి. ఈ రకంగా వర్తమాన కథకులకి ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించారు. దళితవాదం, మైనారిటీ వాదాలకి చెందిన కథలు బాగానే వున్నాయి. మహిళల్లో షాజహానా, ముదిగంటి సుజాతారెడ్డి, గీతాంజలి, జాజుల గౌరి కథలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే తెలంగాణ నుంచి ఇప్పటికీ మహిళలు తక్కువగానే రాస్తున్నారు. అయినా వీరి కథల్లో తెలంగాణ మహిళల జీవితచిత్రణ తగినంతగా లేదు. స్త్రీవాదం ప్రభావం ఇక్కడ పెద్దగా లేకపోవడమే దీనికి కారణం. అంతే కాక ఆంధ్ర ప్రాంతంతో పోల్చుకుంటే తెలంగాణ స్త్రీలు విద్యా, ఉద్యోగ రంగాల్లో తక్కువగా కనిపిస్తారు. ఈ సంకలనంలో స్త్రీల కథలు స్త్రీల ప్రత్యేక సమస్యల కన్నా సాధారణ సమస్యల్నే ఎక్కువగా చిత్రించాయి.దళిత వాదం దగ్గరికి వస్తే కాలువ మల్లయ్య, దొడ్డి రామ్మూర్తి, దార్ల రామచంద్ర , గూడ అంజయ్య మొదలయిన వారి కథలు దళితుల నిర్దిష్ట సమస్యల్ని చిత్రించాయి. తెలంగాణలో దళితుల స్థితికీ, వారి పోరాట చైతన్యానికీ ప్రతిఫలనంగా నిలిచాయి. మైనారిటీల సమస్యల్ని చిత్రిస్తూ షాజహానా, గౌస్ మొహియుద్దీన్, అఫ్సర్ రాసిన కథలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. తెలంగాణలో మైనారిటీల మౌనరోదన, అస్తిత్వం కోసం తండ్లాట వీరి కథల్లో వ్యక్తమవుతాయి.

తెలంగాణ నిర్దిష్టత పదునెక్కిన కాలమిది. ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో తెలంగాణ పల్లె బతుకులు చితికిపోయాయి. మనుషుల మధ్య సంబంధాలు విచ్ఛిన్నమయ్యాయి. భూమి నుంచి నిర్వాసితులయినవారు కొందరు కాగా, బతకడానికి దారిలేక అలమటించే రైతుకూలీలు మరికొందరు. దొరల రాజ్యం అంత మయినట్టు కనిపించినా ఏదో రూపంలో దొరలు మళ్ళీ వస్తూనే వున్నారు. ఈ వాస్తవాల్ని చెప్పే కథలు చాలా వచ్చాయి. కె.వి.నరేందర్ 'దొర మల్లా వచ్చిండు' కథ ఈ కోవకి చెందింది.

వివక్షకి లోనవుతున్న తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటే కథ 'నిత్యగాయాల నది', బెజ్జారపు రవీందర్ రాసిన ఈ కథ ఇవాళ తెలంగాణవాసుల ముందు ఉన్న కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంది. తెలంగాణ తల్లిపై వివక్షని వ్యతిరేకించాలన్న స్పృహని చాటిన కథ ఇది. తెలంగాణ పల్లెల్లో మునుపటి వైభవం లేదు.వ్యవసాయం

నామమాత్రమైంది. ఈ పరిస్థితుల్లో నేలని కాపాడుకోవాలన్న తపనని బలవంతంగా చంపుకోవాల్సిన దుస్థితిని వివరించే కథ 'బొర్ల పొక్కలు'ను బోధనం నర్సిరెడ్డి రాశారు. ఆ విధంగా ఉదారవాద ఆర్థికవిధానాలు, గ్లోబలైజేషన్ తెలంగాణ వారి బతుకుల్లో పెట్టిన చిచ్చును కథకులు చిత్రించారు. మారిపోతున్న విలువలు, జీవిత నమూనాలు మనుషుల్ని ఏ దరికి తీసుకెళుతున్నాయో కథకులు చిత్రిస్తున్నారు.

తెలంగాణలో పాదుకున్న మధ్యతరగతి స్వభావంలో వస్తున్న మార్పుల్ని, దెబ్బతిన్న పోరాట స్పృహని కొందరు కథకులు చిత్రించారు. పి.లోకేశ్వర్, కాసుల ప్రతాపరెడ్డి, ఎన్.కె.రామారావు, ముక్తవరం పార్థసారధి, పులిపాటి గురుస్వామి మొదలయినవారు మధ్యతరగతి కుటుంబాల్లోని వైరుధ్యాల్ని, మధ్యతరగతి మనుషుల స్వభావాల్ని చిత్రించారు.

భాషకి సంబంధించిన స్పృహ బలపడిన కాలమిది. పల్లె జీవితం నేపథ్యంగా వచ్చిన రచయితలు తెలంగాణ ప్రాంత భాషలో స్పష్టంగా రాస్తున్నారు. కానీ కొందరు ప్రయోగాత్మకంగా రాయబోతే వికటిస్తుంది. తెలంగాణ పట్టణాల్లో మధ్యతరగతి ప్రజలు మాట్లాడుతున్న వ్యవహారిక భాషలో కొందరు రచయితలు రాస్తున్నారు. భాష విషయకంగా రాజీపడటం లేదు. తెలంగాణ భాషలోనే రాయాలన్న ధోరణి బలపడింది. భాషకి సంబంధించిన శృంఖలాల్ని ఈ తరం రచయితలు తెంచుకున్నారు. ఇతివృత్తానికి తగిన భాషని ఎంచుకోవాలి, తమ ప్రాంతాన మాట్లాడే భాషలో రాయాలి -అన్న తపన పెరిగింది. ఈ కారణంగా గత పదేళ్ళ కాలం నుంచి వస్తున్న కథల్లో తెలంగాణ భాష గుబాళిస్తోంది. ఇతివృత్తం ఏదైనా తెలంగాణ భాషలోనే కథ చెప్పాలన్న కాంక్ష రచయితల్లో పెరిగింది. కొత్త రచయితలు కూడా ఈ దిశగా ప్రయాణిస్తున్నారు. కథాకథనంలో హాస్యానికి పెద్దపీట వేస్తున్నారు. వ్యంగ్యాన్ని పదునుగా వాడుకుంటున్నారు.

తెలంగాణ నుంచి కవిత్వమే కాదు కథ కూడా బలంగా వస్తుందని చెప్పడానికి ఈ బృహత్తర సంకలనం ఒక తార్కాణం. తెలంగాణ అస్తిత్వ చైతన్యం పదునెక్కిందని చెప్పడానికి ఈ పుస్తకం దాఖలా. హృదయ సంస్కారం ఉన్నవారు తెలంగాణ వారి ఆర్తిని అర్థం చేసుకుంటారు. వారికి సంఘీభావం ప్రకటిస్తారు. అందుకు కావాల్సిన స్ఫూర్తిని ఇచ్చే కథల పుస్తకమిది.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీమతి పద్మ నేమాన & శ్రీ సత్య నేమాన వదాన్య సౌజన్యంతో అందించబడింది.